సంపుటి :02 సంచిక :244 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people



## నామినేషన్ల స్వీకరణలో పొరపాట్లకు తావు ఉండొద్దు..

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

02

సోమవారం 01, డిసెంబర్ 2025

# బంధాలు.. బంధుత్వాల్లేవ్ !


## బరిలోకి దిగడమే లక్ష్యం

- గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల వేడి
- ఎల్లుండి మొదటి విడత ఉపసంహరణ గడువు
- రాజీ ప్రయత్నాలు ముమ్మరం
- కొన్నిచోట్ల నయానో బయానో ఒప్పుకోళ్లు
- మరికొన్నిచోట్ల బుజ్జగింపులు చేసినా బరిలోకి పోటీదారులు

05

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో పోటీకి దిగిన అభ్యర్థులు ప్రత్యర్థులను 'రాజీ' చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల బంధాలు బంధుత్వాలను సైతం పక్కన పెడుతున్నారు. రాజకీయంగా ప్రత్యర్థులుగా బరిలోకి దిగుతున్నారు. వీరిలో అన్నాదమ్ము లు, అక్కా చెల్లెళ్లు, తోటి కోడళ్లు, వదిన మరదలు, బావ బావమరిది, దాయాదుల పిల్లలు ఉంటున్నారు. మరికొన్నిచోట్ల పార్టీల నేతలు జోక్యం చేసుకొని పంచాయతీ ఎన్నికల్లో పోటీకి దిగిన ప్రత్యర్థులను రాజీ చేసే ప్రయత్నాలు ముమ్మ రంగా సాగుతున్నాయి. ఉమ్మ డి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తొలి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు కోసం నామినేషన్ల పర్వం ముగిసిపోయింది. ఈనెల 3న మధ్యాహ్నం వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఈక్రమంలో ఎన్నికల బరిలో నిలిచిన ప్రత్యర్థులను రాజీ చేసుకోవడానికి ప్రత్యర్థులు ప్రయత్నాలు ముమ్మ రం చేశారు.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి





## ఏసీబీ అధికారి ముసుగులో వసూళ్ల దందా

- ఘరానా మోసగాడి అరెస్టు
- రూ.50 లక్షల వరకూ వసూలు చేసిన నిందితుడు
- ముఠాకు చెందిన మరోనలుగురి అరెస్టు
- పరారీలో మరో ముగ్గురు నిందితులు
- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్ ప్రీత్‌సింగ్

02

## రాజీ పడొద్దు!

- నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే
- నిర్దేశిత సమయంలో పనులు పూర్తికావాలి
- ఆచార సంప్రదాయాలను పాటించాలి..
- మేడారం జాతర అభివృద్ధి పనుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

02






## రూ.130 కోట్ల పనులకు ఆమోదం

- మేయర్ అధ్యక్షతన బల్దియా సర్వ సభ్య సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కార్పొరేటర్లు
- అత్యవసర పనుల కోసం ప్రతి డివిజన్ కు రూ.5 లక్షలు

05

## దాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

అక్షర దర్బార్, టేకుమట్ల: టేకుమట్ల తో పాటు, పంగిడిపల్లి గ్రామంలోని పాడి పర్చేస్ సెంటర్‌ను సోమవారం అదనపు కలెక్టర్ అశోక్ పరిశీలించారు. ఈ సందర్భంగా సెంటర్ పనితీరును పూర్తిగా సమీక్షించిన ఆయన, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సెంటర్ ఇంచార్జ్‌లు అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టంగా ఆదేశించారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి, ఆ ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కొనుగోలు ప్రక్రియలో అనవసరమైన ఆలస్యం జరగకుండా, పారదర్శకంగా, వేగవం



తంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నారు.

## నామినేషన్ల స్వీకరణలో పొరపాట్లు చేయొద్దు

అక్షర దర్బార్, వరంగల్: జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద సూచనల ప్రకారం, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఖచ్చితంగా, పొరపాట్లకు అవకాశం లేకుండా నిర్వహించాలి అని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. గ్రామ పంచాయితీ రెండవ విడత ఎన్నికలకు సంబంధించి నర్సంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని దుగ్గొండి, నల్లబెల్లి, గీసుగొండ మండలాల నామినేషన్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, స్వీకరణ, అభ్యర్థుల సౌకర్యాలు, సదుపాయాలను పరిశీలించారు. రెండవ విడత నామినేషన్ల చివరి రోజు ఎక్కువ మంది అభ్యర్థులు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు చేసు



కోవాలని, పొరపాటు జరిగితే నామినేషన్ తిరస్కరణకు గురవుతుందని కలెక్టర్ హెచ్చరించారు. నామినేషన్లు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 వరకు స్వీకరించబడతాయి. కలెక్టర్ వెంట జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, స్థానిక అధికారులు ఇతరులు కూడా పాల్గొన్నారు.

### ఏసీబీ అధికారి ముసుగులో

# వసూళ్ల దందా

- ఘరానా మోసగాడి అరెస్టు
- రూ.50 లక్షల వరకూ వసూలు చేసిన నిందితుడు
- ముఠాకు చెందిన మరోనలుగురి అరెస్టు
- పరారీలో మరో ముగ్గురు నిందితులు
- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ : ప్రభుత్వ అధికారులను ఏసీబీ డీఎస్పీనంటూ బెదిరించి, సులభంగా డబ్బు వసూలు చేస్తున్న ఘరానా మోసగాడు రాచంపల్లి శ్రీనివాస్ అలియాస్ మంగళ శ్రీను అలియాస్ వాసుతో పాటు అతనికి సహకరించిన మరో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వరంగల్ టాస్క్‌ఫోర్స్, మిల్స్ కాలనీ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో ముఠా చిక్కింది. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వివరాలు వెల్లడించారు. ప్రధాన నిందితుడు శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి పుట్టపర్తి జిల్లాకు చెందినవాడు కాగా, మిగిలిన సహచరులైన నవీన్ జేఆర్, మంగళ రవీందర్, మురళి, ఎన్ ప్రసన్న కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరు ప్రాంతాలకు చెందినవారిగా గుర్తించారు.



ముఠాలోని మరో ముగ్గురు నిందితులు సూర్యప్రకాశ్, తాటిమర్రి వేణు, కొత్తకోట రమణ పరారీలో ఉన్నారు.

**- మోసాలు, బెదిరింపులు ఇలా..**

నిందితుడు శ్రీనివాస్ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉన్నత అధికారులను, పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడేవాడు. తాను ఏసీబీ డీఎస్పీనంటూ పలువురికి కాల్ చేసి చేసి "మీపై అవినీతి ఆరోపణలు వచ్చాయి, కేసు నమోదు చేశాం, డబ్బు ఇస్తే కేసు నుంచి తప్పిస్తాం" అని బెదిరించి, డబ్బులు వసూలు చేసేవాడు. దీనిలో భాగంగానే వరంగల్ ఆర్టీఏ పరిధిలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న తుమ్మల జైపాల్ రెడ్డిని బెదిరించి సుమారు రూ. 9.96 లక్షలను కుల్లగొట్టాడు. బాధితుడు జైపాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడిని, అతని సహచరులను అదుపులోకి తీసుకున్నారు.

**- శ్రీనివాస్ నేరచరిత ఇది..**

శ్రీనివాస్ 2002లోనే ద్విచక్ర వాహనాల చోరీతో నేరాలకు పాల్పడటం ప్రారంభించాడు. ఆ తర్వాత నకిలీ పోలీస్ అధికారి అవతారమెత్తి రాయలసీమ ప్రాంతంలో దొంగతనం కేసుల్లో అరెస్టైన వారి కుటుంబాలను బెదిరించి, వారి వద్ద నుంచి బంగారం, డబ్బు దోచుకున్నాడు. నిందితుడిపై 50 కేసులు ఉన్నాయి. జైలు నుంచి విడుదలైన తర్వాత శ్రీనివాస్ కర్ణాటక, రాయలసీమ ప్రాంతాల్లో 41కి పైగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. నాడు మరోసారి జైలుకెళ్లాడు. బెయిల్ పై బయటకు వచ్చిన తర్వాత నకిలీ ఏసీబీ డీఎస్పీగా అవతారం ఎత్తాడు. ప్రభుత్వ ఉద్యోగులను టార్గెట్ చేస్తూ తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో మొత్తం 19 నేరాలకు పాల్పడ్డాడు. నేరాల ద్వారా సుమారు రూ.50 లక్షలకు పైగా దోపిడీకి పాల్పడ్డాడు. నేరాల్లో దోచుకున్న సొమ్మును నిందితుడు ముఠా సభ్యులతో కలిసి ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గోవాలోని కాసినోలలో జూదం ఆడేవాడు. గోవా, బెంగుళూరు ప్రాంతాల్లోని వ్యభిచార గృహాల్లో విచ్చలవిడిగా ఖర్చు చేసేవాడు. మోసగాడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డీసీపీ డి కవిత, ఏసీపీలు ఎన్ శుభం ప్రకాష్, మధుసూదన్, ఇన్‌స్పెక్టర్లు ఎల్ పవన్ కుమార్, కే శ్రీధర్, ఎల్ మంగిలాల్, బి రమేష్ సహా టాస్క్‌ఫోర్స్, మిల్స్ కాలనీ పోలీస్ సిబ్బందిని సీపీ అభినందించి రివార్డులు అందించారు.



# రాజీ పడొద్దు!

- నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే
- నిర్దేశిత సమయంలో పనులు పూర్తికావాలి
- ఆచార సంప్రదాయాలను పాటించాలి..
- మేడారం జాతర అభివృద్ధి పనుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

అక్షరదర్బార్, హైదరాబాద్ : మేడారం అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారులు, ఇంజినీర్లు క్షేత్ర స్థాయిలో ఉండి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని.. ఏ మాత్రం పొరపాట్లు దొర్లినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు. మేడారం అభివృద్ధి పనులపై హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. రాతి పనులతో పాటు రహదారులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, గద్దెల చుట్టూ భక్తుల రాకపోకలకు సంబంధించిన మార్గాలు, భక్తులు వేచి చూసే ప్రదేశాలు ఇలా ప్రతి ఒక్క అంశంపైనా ముఖ్యమంత్రి అధికారులకు సూచనలు చేశారు. పనులు సాగుతున్న తీరుపై ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలించిన సీఎం పలు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఆర్అండ్ బీ, విద్యుత్ శాఖ, దేవాదాయ శాఖ, అటవీ శాఖ, స్థపతి శివనాగిరెడ్డి సమన్వయంతో సాగాలని సీఎం సూచించారు. అభివృద్ధి పనుల్లో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలకు పెద్ద పీట వేయాలని సీఎం తెలిపారు. నిర్దేశిత సమయంలోనే అభివృద్ధి పనులు పూర్తి కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిర్మాణం పనుల్లో చిన్న విమర్శలకూ తావు ఇవ్వద్దని, గద్దెల సమీపంలో వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గద్దెల దగ్గర నాలుగు వైపులా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని, గ్రాండ్ లుక్ వచ్చేలా లైటింగ్ ఉండాలని, గద్దెల చుట్టూ పచ్చదనం అభివృద్ధి చేయాలని అన్నారు. సమీక్షలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి కేవీస్ శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ పాల్గొన్నారు.

## అద్దె గదుల బకాయిలు చెల్లించాలి : రేవూరి

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ శాఖ అధికారులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీకి సంబంధించిన అద్దె బకాయి దారులు నిర్ణీత గడువులోపు చెల్లించాలని అన్నారు. అలాగే చెల్లించవలసిన బకాయి 4 విడతల్లో చెల్లింపు చేయుటకు అవకాశం కల్పించామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, టిపిఓ సుష్మ తదితరులు పాల్గొన్నారు.






## 'బాలాజీ' లో ఘనంగా గీతా జయంతి వేడుకలు

అక్షర దర్బార్ , నర్సంపేట రూరల్ : బాలాజీ విద్యాసం స్థల పరిధిలోని బాలాజీ టెక్నో స్కూల్, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్, అక్షరా ద స్కూల్‌లలో గీతా జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధినేత డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ రెడ్డి, ట్రెజరర్ వనజ హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రెజరర్ వనజ మాట్లా డుతూ.. మార్గశిర శుక్ల ఏకాదశిని గీతా జయంతిగా జరుపుకుంటారని తెలిపారు. విద్యార్థులు దశావతారాలు, కృష్ణార్జునుల వేషధారణ, గోదా కళ్యాణం నాటకం, గీతా శ్లోకాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ రాజేంద్రప్రసాద్ జ్యోతి భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న నామినేషన్ల పర్వం




అక్షర దర్బార్ వెంకటాపూర్ : రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండవ రోజు కూడా కొనసాగుతుంది.ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలో స్థానిక పోరులో నామినేషన్ల పర్వం కొనసాగుతుంది. అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు పకడ్బందీగా పరిశీలించి అధికారులకు అందజేస్తున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 23 గ్రామ పంచాయతీలకు గాను రెండవ రోజు సర్పంచ్ అభ్యర్థులకు, వార్డ్ మెంబర్లకు దర ఖాస్తులు అధికారులు స్వీకరించారు. స్థానిక పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పకడ్బందీగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు.

# నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్సై

అక్షర దర్బార్, టేకుమట్ల: మండల కేంద్రంలో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను స్థానిక ఎస్సై దాసరి సుధాకర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలను సమీక్షిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడారు.తరువాత నామినేషన్ దాఖలు ప్రగతిపై అధికారులు అందించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన సూచనలు ఇచ్చారు.








# ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి

**ఐఎంఏ నర్సంపేట అధ్యక్షుడు డాక్టర్ వి.ఎం. జయుడు**

అక్షర దర్బార్, నర్సంపేట : ఎయిడ్స్‌ను నిర్మూలించేందుకు నివారణే ప్రధాన మార్గమని, ఎయిడ్స్ రహిత సమాజం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని నర్సంపేట ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎం. జయుడు పిలుపునిచ్చారు. సోమవారం ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నర్సంపేట ఐఎంఏ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించబడింది. నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డు చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తాలలో విద్యార్థులతో మానవహారం నిర్వహించగా, ర్యాలీలో విద్యార్థులు, వైద్యులు, ప్రజలు పాల్గొని ఎయిడ్స్ నిర్మూలనకు సంబంధించిన నినాదాలు చేయడంతో పట్టణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో వైద్యులు ఉదయ్ సింగ్, మనోజ్ లాల్, జగదీష్, విజయ్, హిమబిందు, సుజాత రాణి, శంకర్, గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ సుబ్బారావు, ఎస్సార్ ఒకేషనల్ కాలేజ్ కరస్పాండెంట్ కొయ్యడి సనత్‌కుమార్, వైద్య సిబ్బంది శ్రీనివాస్, జగన్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

**ములుగు జిల్లా కలెక్టర్ ఆదేశాలు**

అక్షర దర్బార్, ములుగు: శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆర్డీవో వెంకటేష్‌తో కలసి క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించారు. విఐపి, వివిఐపి పార్కింగ్, రహదారులు, గద్దెల ప్రాంగణ అభివృద్ధి, రెడ్డిగూడెం అంతర్గత రహదారులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమం

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- బీఆర్ఎస్ లో చేరిన కాంగ్రెస్ నాయకులు



అక్షర దర్బార్, పరకాల : నడికూడ మండలం రాయపర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అకినపెల్లి లింగయ్య, కోడెపాక బాబులు, చెన్న గణేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, "మాజీ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ–అభివృద్ధి కార్యక్రమాల వల్లనే ప్రజలు మంచి రోజులు చూశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నిలబెట్టకుండా ప్రజలను విస్మరిస్తూ స్కాంలకే ప్రాధాన్యత ఇస్తోంది" అని విమర్శించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు అభ్యర్థులను పెద్ద మెజారిటీతో గెలిపించి కేసీఆర్‌కు బలమైన మద్దతు ఇవ్వాలని గ్రామస్థులను ఆయన పిలుపునిచ్చారు.

# రైతులు అప్రమత్తంగా ఉండాలి

**మాదారం పీఏసీసీఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి**



అక్షర దర్బార్, పరకాల: దిత్వా తుఫాన్ ప్రభావం తెలంగాణపై ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రైతులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని మాదారం పీఏసీసీఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి సూచించారు. సోమవారం మాదారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, ఇప్పటికే కేంద్రానికి తెచ్చిన వరి ధాన్యాన్ని పరదాలను ఏర్పాటు చేసి భద్రపరచాలని, వర్షాల ప్రభావం పడకుండా సకాలంలో రవాణా చేయాలని సిబ్బందికి తెలియజేశారు. రైతుల శ్రేయస్సే తమ మొదటి బాధ్యతని పేర్కొన్న లింగమూర్తి, తుఫాన్ సమయంలో ప్రతి రైతు ధాన్యం సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

అక్షర దర్బార్, భూపాలపల్లి : జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 3 వ తేదీన హైదరాబాద్ లో జరిగే మహా ధర్నా పోస్టర్ ను ఆవిష్కరించినట్లు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, రాష్ట్ర హెల్త్ సెక్రటరీ సామల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఈ సీ మెంబర్ వీరభద్ర స్వామి సభ్యులు పాల్గొన్నారు.



# పోలీస్ యాక్ట్ అమలు

**- భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**




అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజులు (డిసెంబర్ 1 నుంచి 31 వరకు) జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, నిబంధనలకు విరుద్ధంగా డీజే వినియోగించరాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.



# 'గీతాంజలి'లో భగవద్గీత పఠనం

అక్షర దర్బార్, నర్సంపేట : గీతా జయంతి సందర్భంగా నర్సంపేట పట్టణంలోని గీతాంజలి హైస్కూల్‌లో సోమవారం భగవద్గీత పఠనం కార్యక్రమం నిర్వహించారు. 5వ తరగతి విద్యార్థినులైన అక్షిత, శుభయశ్రీ, శివప్రియలు స్థానిక అయ్యప్పస్వామి గుడిలో గీతా శ్లోకాలు పఠించి భక్తులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా యోగా గురువు సదానందం బాపూజీ మాట్లాడుతూ "భగవద్గీత ఒక జ్ఞాన గ్రంథం. ఇది బ్రతుకు బాటలో మార్గనిర్దేశం చేస్తుంది; గౌరవంతో చదవాలి" అని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు మాధవ శంకర్, కమిటీ అధ్యక్షులు సైఫా సురేష్, కమిటీ సభ్యులు విద్యార్థినులు మరియు యోగాచార్యులకు కండువాలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, ప్రిన్సిపాల్ ఎన్.రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ పవన్, ఇన్‌చార్జ్ రాధా పాల్గొన్నారు.

# శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయంలో భూమిపూజ

అక్షర దర్బార్, పరకాల : పరకాల ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం ధర్మ సదన నిర్మాణానికి భూమిపూజ ఘనంగా నిర్వహించారు. కీ.శే ఆకుల సంజీవ్ స్మృతిర్థం వారి ధర్మపత్నీ ఆకుల సరోజన సదన నిర్మాణానికి ముందుకు రావడంతో, ఏకాదశి సోమవారాన్ని పురస్కరించుకుని శుభముహూర్తంలో కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి నాగభూషణ శర్మ నేతృత్వంలో వేద మంత్రోచారణల మధ్య సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొలుగురు రాజేశ్వరరావు, కమిటీ సభ్యులు గోవిందు సంధ్య సత్యనారాయణ, గౌరి శెట్టి నవీన్, లక్కం సురేష్, గంజి వెంకటరెడ్డి, నాగబండి జ్ఞానానందం, యర్రం లక్ష్మణ్, రాజేంద్ర కుమార్, కందుకూరి శ్రీధర్, అడగాని జనార్దన్ రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

## పాపయ్యపేట సర్పంచ్ అభ్యర్థి విద్యావేత్త మేడి రమేష్ గౌడ్



అక్షర దర్బార్, చెన్నారావుపేట : వేలాది మంది విద్యార్థులకు సన్మార్గం చూపుతూ, వారి విద్యాభివృద్ధికి తన వంతు సేవ అందించిన సీనియర్ అధ్యాపకుడు, విద్యావేత్త మేడి రమేష్ గౌడ్ ఇప్పుడు ప్రజాసేవ కోసం రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు. పాపయ్యపేట గ్రామ సర్పంచ్‌గా అవకాశం ఇస్తే గ్రామ అభివృద్ధిలో ముందుండి పని చేస్తానని ఆయన తెలిపారు. సోమవారం ఆయన 'అక్షర దర్బార్'తో మాట్లాడుతూ.. "ఎన్నో ఏళ్లుగా నిస్వార్థంగా విద్యా సేవ చేశాను. ప్రజలు తనకు అవకాశం ఇస్తే పాపయ్యపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాను" అని అన్నారు. ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో ఉన్న సమస్యలను చూసి ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేయాలనే ఉద్దేశంతోనే పోటీ చేస్తున్నానని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల అభ్యున్నతే తన ధ్యేయమని, గ్రామ సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



# లేబర్ కోడ్ లతో కార్మిక హక్కులకు ముప్పు

## : ఏఐటీయూసీ మండల కార్యదర్శి భాస్కర్

అక్షర దర్బార్, కేసముద్రం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి ఉరి తాళ్లుగా మారాయని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో ఏఐటీయూసీ అనుబంధ ట్రాన్స్పోర్ట్ హమాలి యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బ్రిటిష్ కాలంలోనే కార్మికులు గెలుచుకున్న హక్కులు, చట్టాలను కేంద్ర ప్రభుత్వం చెడుపరిచే విధంగా ఈ లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టిందన్నారు. భాస్కర్ వ్యాఖ్యల ప్రకారం, లేబర్ కోడ్‌ల కారణంగా కార్మికులకు సమ్మె హక్కు, రేట్లు పెంపు, బోనస్, పరిశ్రమలలో యూనియన్ ఏర్పాట్ల హక్కులు అందడంలేదు. 8 గంటల పని దినాన్ని 12 గంటలుగా మార్చడం, కార్మికుల త్యాగాలను కింద చాపడం వంటి చర్యలను ఆయన తీవ్ర ఆగ్రహంగా ఖండించారు. వెంటనే ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభలో యూనియన్ నాయకులు మౌలానా, చంద్రయ్య, జిలాని, పయ్యావుల వెంకన్న, ఉప్పలయ్య, మహమూద్ పాషా, వెంకన్న, వీరయ్య, రమేష్, ఐలయ్య పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరికలు



అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట మండలం ఇటుకాలపెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు సోమవారం బీజేపీలో చేరారు. సౌనబోయిన రాజు, సౌనబోయిన కృష్ణ, సౌనబోయిన శివకుమార్‌లు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి రాము ఆధ్వర్యంలో, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సమక్షంలో చేరిక పూర్తిచేశారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, "నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధుల వల్లే గ్రామాభివృద్ధి సాధ్యమవుతోందనే గ్రహించినందుకు నాయకులు బీజేపీలోకి వస్తున్నారు" అని అన్నారు. నర్సంపేట నియోజకవర్గంలో రాబోయే స్థానిక ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇచ్చి, వారిని ప్రజా ప్రతినిధులుగా నిలబెట్టే దిశగా పార్టీ పని చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, అచ్చ దయాకర్, పొగాకు విఘ్నేశ్, జూలూరి మనీష్, బానోత్ రమేష్, పల్లకొండ శ్రీను, కార్తీక్ పాల్గొన్నారు.





పడిపూజలో పాల్గొన్న భక్తులు, అయ్యప్ప మాలధారులు

# వైభవంగా పడిపూజ

- 18వ రోజుకు చేరుకున్న మహా అన్నదాన కార్యక్రమాలు
- అయ్యప్పస్వామి దేవాలయంలో కన్నుల పండుగగా అయ్యప్పస్వామి అభిషేకాలు
- వేలాదిగా హాజరైన మాలదారులు, భక్తులు

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో 25వ రజతోత్సవ మండల పూజల సందర్భంగా సోమవారం మహాదివ్య పడిపూజ వైభవంగా జరిగింది. దేవాలయ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సింగిరికొండ మాధవశంకర్ గుప్తా, అధ్యక్షుడు సైపా సురేష్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్ గుప్తా సమక్షంలో ఈ పూజలు నిర్వహించబడాయి. మల్యాల శ్రీలత రాజు, సాగరిక ప్రవీణ్‌కుమార్ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా కుటుంబ సభ్యులు పడిపూజను చేపట్టగా, ప్రధాన అర్చకులు దేవేశ్ మిశ్రా వేదమంత్రాలతో కన్నుల పండుగగా పూజ కార్యక్రమాలు జరిపారు. ఉదయం సుప్రభాతం తర్వాత గణపతి హోమం, ప్రత్యేక పూజలు, అనంతరం అయ్యప్పస్వామికి అష్టాభిషేకాలు, కళాశాభిషేకాలు నిర్వహించగా భక్తులు ధారాళంగా పాల్గొన్నారు. పుష్పాభిషేకం వైభవంగా సాగగా, పదునెట్టాంబడిపై కర్పూర హారతులతో ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది.

## అన్నదాన కార్యక్రమాలు 18వ రోజుకు చేరిక

మండల పూజల్లో భాగంగా జరుగుతున్న మహా అన్నదాన కార్యక్రమం సోమవారం 18వ రోజుకు చేరుకుంది. ఈ రోజు అన్నదాతలుగా తుమ్మ రజిత రమేష్, సాయికిరణ్, బ్రాహ్మణపల్లి సునీత సుమన్, సింగిరికొండ సుష్మ–సతీష్ అభిరామ్ లు సేవ అందించారు. సోమవారం నిర్వహించిన పడిపూజకు సుమారు 3,000 మంది భక్తులు, మలాదారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దోమకుంట్ల నందయ్య గురుస్వామి, శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, బండారుపల్లి చెంచారావు, పాలకుర్తి శ్రీనివాస్, దొడ్డ వేణు, అనంతుల రాంనారాయణ, బీరం నాగిరెడ్డి, గురుస్వాములు సంజీవరావు, బొట్ల నాగరాజు, యాదగిరి, రాయసాబ్, అంకూస్ గౌడ్, గుమాస్తా దేశి రాము, అర్చకులు ఫ్రాన్స్, శివాంకిత్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన
# అడిషనల్ కలెక్టర్



అక్షర దర్బార్, పరకాల : పరకాల నియోజకవర్గం కామరెడ్డిపల్లిలోని నామినేషన్ కేంద్రం, పోలింగ్ స్టేషన్లు మధ్యాహ్న భోజన పథకం అమలును అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీఓ డాక్టర్ నారాయణ, ఎంపీడీఓ విమల, తహసిల్దార్ విజయలక్ష్మి సోమవారం పరిశీలించారు. నామినేషన్ కేంద్రంలో అభ్యర్థులకు అందాల్సిన సౌకర్యాలు, పోలింగ్ స్టేషన్లలో విద్యుత్, త్రాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతుల స్థితిని పరిశీలించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట నిర్వహణ, ఆహార నాణ్యత, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను పరిశీలిస్తూ అవసరమైన సూచనలు జారీ చేశారు.



# నాయీ బ్రాహ్మణ వృత్తిని కాపాడాలి

అక్షర దర్బార్, నల్లబెల్లి: అంతరించిపోతున్న నాయీ బ్రాహ్మణ వృత్తిని కాపాడాలని తెలంగాణ నాయీ బ్రాహ్మణ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నల్లబెల్లిలో ఆయన మాట్లాడుతూ.. తరతరాలుగా 'మంత్రసాని' సేవలతో జీవనం సాగించిన నాయీ బ్రాహ్మణులు ఆధునిక మార్పులు, కార్పొరేట్ సెలూన్ల ప్రభావంతో తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారని వాపోయారు. భారీ పెట్టుబడులతో వచ్చిన కార్పొరేట్ సెలూన్లు చిన్న నాయీ దుకాణాలపై ఆర్థిక ఒత్తిడి పెంచుతున్నాయని, అనేక గ్రామీణ సెలూన్లు మూతపడిపోయాయని పేర్కొన్నారు. నగరాల్లో తక్కువ జీతాలతో జీవనం కష్టమవడంతో నాయీ బ్రాహ్మణ కుటుంబాలు వలస వెళ్తున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. వృత్తి సంరక్షణకు చట్టబద్ధ రక్షణ కల్పించి, నాయీ బ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం, ప్రతి కుటుంబానికి రూ.2 లక్షలు పూర్తి సబ్సిడీగా ఇవ్వడం, గ్రామాల్లో వృత్తి కొనసాగించేవారికి రూ.5 లక్షలు 50% సబ్సిడీతో ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# కాంగ్రెస్ పార్టీకి ఓటడిగే హక్కు లేదు

- స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయం..
- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్



అక్షర దర్బార్, కేసముద్రం : ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదని స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలలో అభివృద్ధి శూన్యమన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్న ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ 2500,రైతు భరోసా రూ.15 వేలు, కళ్యాణ లక్ష్మి తులం బంగారం,రెట్టింపు పింఛన్లు ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు.ఎన్నికలు వస్తున్నాయని మహిళలకు హడావుడిగా చీరలు పంపిణీ చేశారన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కేవలం అధికారంలోకి రావడం కోసమే అనేక హామీలను ప్రకటించి అనంతరం వాటి అమలను విస్మరించిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామపంచాయతీలకు సకల సౌకర్యాలు కల్పించి అన్ని వనరులను కల్పించారన్నారు. గ్రామాల్లో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోయి గోస పడొద్దని సూచించారు. కార్యకర్తలను కంటికి రెప్పల కాపాడుకుంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ నాయక్ తెలిపారు.అనంతరం బిఆర్ఎస్ పార్టీలోకి చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శ్రీనాథ్ రెడ్డి,బిఆర్ఎస్ నాయకులు నీలం దుర్గేష్,నజీర్ అహ్మద్,కముటం శ్రీను,హరి నాయక్, వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బంధాలు.. బంధుత్వాల్లేవ్!

- బరిలోకి దిగడమే లక్ష్యం
- గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల వేడి
- ఎల్లుండి మొదటి విడత ఉపసంహరణ గడువు
- రాజీ ప్రయత్నాలు ముమ్మరం
- కొన్నిచోట్ల నయానో భయానో ఒప్పుకోళ్లు
- మరికొన్నిచోట్ల బుజ్జగింపులు చేసినా బరిలోకి పోటీదారులు



అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో పోటీకి దిగిన అభ్యర్థులు ప్రత్యర్థులను 'రాజీ' చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల బంధాలు బంధుత్వాలను సైతం పక్కన పెడుతున్నారు. రాజకీయంగా ప్రత్యర్థులుగా బరిలోకి దిగుతున్నారు. వీరిలో అన్నాదమ్ములు, అక్కా చెల్లెళ్లు, తోటి కోడళ్లు, వదిన మరదలు, బావ బావమరిది, దాయాదుల పిల్లలు ఉంటున్నారు. మరికొన్నిచోట్ల పార్టీల నేతలు జోక్యం చేసుకొని పంచాయతీ ఎన్నికల్లో పోటీకి దిగిన ప్రత్యర్థులను రాజీ చేసే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తొలి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు కోసం నామినేషన్ల పర్వం ముగిసిపోయింది. ఈనెల 3న మధ్యాహ్నం వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఈక్రమంలో ఎన్నికల బరిలో నిలిచిన ప్రత్యర్థులను రాజీ చేసుకోవడానికి ప్రత్యర్థులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

### - ప్రధాన పార్టీల ప్రయత్నాలు ముమ్మరం

పార్టీపరమైన ఎన్నికలు కానప్పటికీ అధికార కాంగ్రెస్, ప్రతి పక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాలు ఎవరికి బలం ఉన్నచోట వారు పోటీకి దిగిన ఇతరులను ఉపసంహరించుకునే విధంగా రాజీ ప్రయత్నాలు జోరుగా సాగిస్తున్నారు. చాలాచోట్ల గ్రామాల్లో వార్డు సభ్యులకు పెద్దగా పోటీ లేనప్పటికీ, సర్పంచులకు మాత్రం బహుముఖ పోరు తప్పించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. బలం ఎక్కువగా ఉన్నచోట సర్పంచు పదవులను తాము తీసుకొని, ఇతర పార్టీలకు ఉపసర్పంచ్, వార్డు సభ్యుల పదవులను ఇవ్వడానికి, లేదంటే 'నయానో బయానో' ఒప్పించేందుకు ఆయా పార్టీల నేతలు రెండు రోజుల్లో నుండి ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ఈసారి తమకు వదిలేస్తే వచ్చే ఎంపీటీసీ, సింగిల్ విండో ఎన్నికల్లో మీకు మద్దతిస్తామంటూ ప్రతిపాదనలు తెస్తూ రాజీ కోసం తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. ఏకగ్రీవం కోసం చాలాచోట్ల ప్రయత్నాలు చేస్తూ ఎన్నికల 'ఖర్చు' తప్పించుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

### - బంధువులు, అన్నాదమ్ముళ్ల మధ్య పోరు

జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలో సర్పంచ్ పదవికి అన్నదమ్ములు రంగు రమేష్, రంగు హరీష్ పోటీకి దిగారు. రమేష్ ను అధికార పార్టీ బలపరచగా హరీష్ కు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. నల్గొండ జిల్లా పరిధిలోని మిర్యాలగూడ సమీపంలోని అయిలాపూరంలోఒకే ఇంటికి చెందిన ఇద్దరు అన్నాదమ్ములు సర్పంచ్ పీఠం కోసం పోటీ పడ్డారు. పెద్దన్నఎల్లయ్య అధికార పార్టీ మద్దతుతో నామినేషన్ వేయగా, చిన్న తమ్ముడు బీఆర్ఎస్ నుంచి నామినేషన్ వేశాడు. కరీంనగర్ జిల్లాలోని గంగాధర పంచాయతీలో రిజర్వేషన్లు మారడం వల్ల, ఒకే కుటుంబంలోని ఇద్దరు అక్కాచెల్లెళ్లు లక్ష్మి , కవిత ఒకరిపై ఒకరు పోటీకి దిగారు. ఆదిలాబాద్ జిల్లాలోని వడ్గల్పూర్ సర్పంచ్ పదవి గిరిజన రిజర్వేషన్ కావడంతో, ఒకే తెగకు చెందిన దాయాదులు రాం తడోబా, పహార్ మాడవి బరిలోకి దిగారు.




## సమ్మిట్ కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**–సీఎస్ రామకృష్ణారావు**

అక్షర దర్బార్, హైదరాబాద్ : డిసెంబర్ 8, 9 తేదీల్లో ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. సమ్మిట్‌కు దేశ–విదేశాల నుంచి ప్రముఖులు, పరిశ్రమల ప్రతినిధులు హాజరుకానున్నందున వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు నిరాటంకంగా ఉండాలని సీఎస్ సూచించారు. ప్రజా భావన్‌లో ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు చేసి ఏర్పాట్లను రోజువారీగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని శాఖలు తమ పురోగతిని సమ్మిట్‌లో ప్రదర్శించనున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్లీనరీ సెషన్లు, వన్–టు–వన్ సమావేశాలు, వివిధ సంస్థలతో కుదిరే ఎంఓయూలు ఈ సమ్మిట్ ప్రధాన అంశాలని తెలిపారు. ఈసారి పెద్ద ఎత్తున ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉందని సీఎస్ పేర్కొన్నారు. డిసెంబర్ 13 వరకు సమ్మిట్ కొనసాగనున్నదీ, అదే రోజు ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ మ్యాచ్‌తో కార్యక్రమం ముగియనున్నదీ సీఎస్ వెల్లడించారు.



## అలసత్వం వహిస్తే సస్పెన్షన్

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరుపై సీరియస్
- ఎప్పటికప్పుడు ధాన్యం ట్యాబ్ ఎంట్రీ చేయాలని ఆదేశాలు

అక్షరదర్బార్, భూపాలపల్లి: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో సివిల్ సప్లై, ట్రాన్స్ పోర్ట్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, కోపరేటివ్, మార్కెటింగ్ శాఖల అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరిత గతిన ధాన్యం కొనుగోళ్ల చేపట్టాలని అన్నారు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు అందుబాటులో ఉండడం లేదని, ట్యాబ్ ఎంట్రీ చేసి నివేదికలు అందించే విషయం ఆలస్యం అవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో లేని నిర్వాహకులను సస్పెండ్ చేస్తామని, అలాగే సంబంధిత అధికారులకు చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద సెంటర్ ఇంచార్జీలు కచ్చితంగా అందుబాటులో ఉండాలని, ప్రతి రోజు రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని ప్రతి రోజు తేమ శాతం పరీక్షించి రిజిస్టర్ లో నమోదు చేయాలని సూచించారు. ఏ రోజు కారోజు కొనుగోలు చేసిన ధాన్యం ట్యాబ్ ఎంట్రీ చేయాలని తెలిపారు.

## రూ.130 కోట్ల పనులకు బల్దియా ఆమోదం

- మేయర్ అధ్యక్షతన బల్దియా సర్వ సభ్య సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కార్పొరేటర్లు
- అత్యవసర పనుల కోసం ప్రతి డివిజన్ కు రూ.5 లక్షలు






అక్షరదర్బార్, వరంగల్: బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో సోమవారం నగర మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిల్ 39 అంశాలకు, రూ.130 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ (పశ్చిమ), వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ముందుగా ఇటీవల మృతి చెందిన ప్రముఖ సహజ కవి అందెశ్రీతో పాటు మాజీ కౌన్సిలర్ బైరీ సాంబయ్యకు కౌన్సిల్ లో నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి మేయర్ మాట్లాడుతూ ఇటీవల మొంథా తుఫాన్ వరదల వల్ల వరంగల్ మహా నగరపాలక సంస్థలోని కాలనీలు జలదిగ్బంధంలో ఉన్నాయని తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగరానికి చేరుకొని పలు ప్రాంతాల్లో వరద బాధిత కుటుంబాలను ప్రత్యక్షంగా కలిసి సహాయం చేస్తానని ఇచ్చిన మాటను సీఎం నిలుపుకొన్నారు. వరద వల్ల దెబ్బతిన్న ఒక్కో ఇంటికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతోపాటు వరద బాదిత కుటుంబాలకు ఒక నెల రేషన్ అదనంగా మంజూరు చేశారు. వరద ముంపు తప్పించేందుకు, శాశ్వత పరిష్కారం దిశగా సీఎం ఆదేశాలతో దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేశాం. త్వరలోనే వరద ముంపు శాశ్వత నివారణ పనులు ప్రారంభం కానున్నాయని అన్నారు. అత్యవసర పనుల కోసం ప్రతి డివిజన్ కు రూ.5 లక్షలు మంజూరు చేయడానికి ఈ కౌన్సిల్లో ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ సీఎం హైదరాబాద్ తర్వాత రెండో అతి పెద్ద నగరంగా వరంగల్ కు ప్రాధాన్యం ఇచ్చి ఇతోధికంగా నిధులు మంజూరు చేస్తున్నారని, కానీ అధికారుల తీరు బాగాలేదని విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం బాధాకరమని అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ కు సంబంధించి గత 10 ఏళ్లకు, ప్రస్తుత 2 ఏళ్లలో జరిగింది గమనించాలని, ఎవరికైన అనుమానాలు ఉంటే తీసుకెళ్లి చూపించడానికి సిద్ధమని అన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ఓపెన్ ప్లాట్ ఓనర్ లకు నోటీసులు ఇచ్చి నీరు నిలవకుండా చూడాలని, తద్వారా డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని పేర్కొన్నారు. నగరంలో కోతుల సమస్య పరిష్కారానికి ఇటీవల టెండర్ పిలిచి ఒక్కో కోతిని పట్టుకోవడానికి రూ.520 చెల్లించేలా ఖరారు చేశామని కమిషనర్ బాజ్ పాయి తెలిపారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915